తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com
# అక్షరగళం
నిజం..నిర్భయంగా
హైదరాబాద్ | శనివారం | 10-01-2025 | సంపుటి-03 | సంచిక-216 | పేజీలు - 08 | వెల:3/–

# గోట్ బ్లడ్ మాఫియా వ్యవహారం

## మేక రక్తం సేకరిస్తున్న మటన్ షాపుపై కేసు నమోదు



**అక్షరగళం,మేడ్చల్,జనవరి9:**

జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగజీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈనెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలూ పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.



# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

## ఈడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన
## మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి
## విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడి పిటిషన్

**అక్షరగళం, కోల్‌కతా,జనవరి9:**

ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా

మిగతా 2లో

# గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

## 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమి
## క్యూర్ 'ప్యూర్ 'రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్
## గ్లోబల్ ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**అక్షరగళం, హైదరాబాద్,జనవరి9:**

హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతోందంటే అది గత మూడు దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఇటువంటి తయారీ యూనిట్లు రావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం వాటా తెలంగాణదేనని, ఫార్మా రంగంలో ప్రపంచమే మన వైపు చూసేలా ఎదుగుతున్నామని గర్వంగా చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూల మైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే అని సీఎం అన్నారు. రాజకీయ వివాదాల కంటే సమస్యల పరిష్కారానికే తాము ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు

మిగతా 2లో

# టిక్కెట్ ధరలు ఎలా పెంచుతారు...

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు
## ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారు



02




# వివాదాలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం

## ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులకు అడ్డంపడకండి
## జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
## మన సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
## ఎపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్ సూచన
## కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి9:**

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. లో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై

మిగతా 2లో



# మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## డిసిఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి


**అక్షరగళం, నల్లగొండ,జనవరి 9:**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని

మిగతా 2లో

# రాజముద్రతో పాస్ పుస్తకాలు

## 'మీభూమి మీహక్కు' అని ఎన్నికల ప్రచారంలో చెప్పా
## రాయవరంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
## గతంలో జగన్ బొమ్మలు ముద్రించడంపై ఆగ్రహం
## రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తున్నట్లు చంద్రబాబు వెల్లడి



**అక్షరగళం, కాకినాడ,జనవరి9:**

కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని.. 'మీ భూమి `మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని తెలిపారు. గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పా. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పనిచేయాలి. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తాం అన్నారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్

మిగతా 2లో

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

## అదే తన జీవిత లక్ష్యం అన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
## వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయ పథకాలకు శ్రీకారం



**అక్షరగళం, భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 9:**

గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో మూలకిపడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పున:ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. శుక్రవారం అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్

మిగతా 2లో




# మహిళలు, చిన్నారుల భద్రత కోసం చర్యలు

## దాడులతో పలువురు బాలలకు విముక్తి
## సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి9:**

మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ వారం పలు విస్తృత చర్యలు చేపట్టామని డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్

మిగతా 2లో




# గొడవలు చేస్తే ఏరిపారేస్తా

## అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను
## శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి
## పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి
## పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్
## సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు

**అక్షరగళం, కాకినాడ,జనవరి9:**

పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది.

మిగతా 2లో

# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

## సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు
## బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జనార్



**అక్షరగళం, హైదరాబాద్,జనవరి9:**

సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌ర్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ర్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన

మిగతా 2లో

# సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

## పండగల విశిష్టతను బాగా చాటాలి
## సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం
## ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా
## విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు



02



# హిమాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## లోయలో పడ్డ ప్రైవేట్ బస్సు..8మంది దుర్మరణం

**అక్షరగళం, సిమ్లా,జనవరి9:**

హిమాచల్ ప్రదేశ్ లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుప్వి నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపుతప్పి లోయలో పడిరది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మౌర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే

మిగతా 2లో

తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
Aksharagalam.com


# టిక్కెట్ ధరలు ఎలా పెంచుతారు...



**హైదరాబాద్,జనవరి9:** కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడిరది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

(మొదటిపేజీ తరువాత)



ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ.1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడిరచారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వరావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడిరచారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకూ, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతులకు అదనపు లాభాలు వస్తాయని తెలిపారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్ర భాగాన ఉండాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు తమ ప్రభుత్వం పట్టుదలగా ఉందని పేర్కొన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి 470 బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని వెల్లడిరచారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉత్తమ కళాశాలగా నిలవాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతులకు మహర్దశ వచ్చిందని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



# పిఠాపురంలో గొడవలు చేస్తే ఏరిపారేస్తా

(మొదటిపేజీ తరువాత)

శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ 'పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

## సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై తరచూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీసులను నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు.



# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటిపేజీ తరువాత)

హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచి పెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి



**విశాఖపట్నం,జనవరి9:** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫలసాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగోవంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

## మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ



(మొదటిపేజీ తరువాత)

అడ్డంకులు సృష్టించవద్దని, అడ్డంకుల వల్ల కేంద్ర నిధులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలన్నా, నీటి సమస్యలు తీరాలన్నా ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల సహకారం అవసరమని, అందుకే తాము వివాదాల కంటే సామరస్యపూర్వక చర్చలకే మొగ్గు చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల, రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నివసిస్తున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడమే తమ సంకల్పమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## వివాదాలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం

(మొదటిపేజీ తరువాత)

స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు



ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.




## ఘోర రోడ్డు ప్రమాదం


(మొదటిపేజీ తరువాత)

సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి సీరియస్‌గా ఉండటంతో హెయిర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్లు నిశ్చింత్ సింగ్ చెప్పారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

# కరోనా సమయంలో కష్టపడి అన్నం పెట్టారు

(మొదటిపేజీ తరువాత)

ఉండాలి. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం. 22'ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ తొలగిస్తున్నాం. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నా. కుటుంబ సభ్యులు, బంధువులతో వివాదాలు వద్దు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితమంతా ఖర్చయిపోతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అయితే పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతులంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై సీఎం మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేలు




కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి ` మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్‌లింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రత కోసం చర్యలు

(మొదటిపేజీ తరువాత)

యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేసి 215 మంది పిల్లలను, అంటే 200 మంది బాలురను మరియు 15 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగారు . సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 127 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 59 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 63 ఖ।బిబా కేసులు




నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 17 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలును పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 31 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడిరచడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మొత్తం 6,615 మందికి అవగాహన కల్పించామన్నారు. అలాగే మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాల నివారణ కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు.

# ఇంకా ఏ విధంగా ముందుకు వెళ్లాలి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు 1995 సెప్టెంబర్ 1న ప్రమాణ స్వీకారం చేశారు. నేనూ అదే రోజున చీఫ్ పీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టాను. ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి చంద్రబాబుకు రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలని, దేశదేశాల్లో ఉన్న అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అమలు చేయాలని ఉండేది. అందుకే మొదట్లో ఆయన ఎన్నో విదేశీ పర్యటనలు చేశారు. ఆ దేశాల్లో తాను చూసిన అభివృద్ధి గురించి పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయాలి అన్న తపన ఆయనలో ఎక్కువగా ఉండేది. ఆయనతో పాటు ఎన్నో దేశాలు తిరిగిన నేను ఆ వార్తలను రాష్ట్ర ప్రజానీకానికి అందించడంలో నూరుశాతం సఫలం అయ్యానని భావిస్తాను. అప్పట్లో ఇప్పుడున్నంత టెక్నాలజీ లేదు. సెల్‌ఫోన్లు లేవు. ఇన్ని టీవీ చానెళ్లు లేవు. అలాంటి కాలంలో సమాచార నిర్వహణలో నేను పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. 1995– 2004 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మలేషియా, సింగపూర్, అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్, దుబాయ్, ఇటలీ, లండన్ దేశాల్లో పర్యటించారు. ఈ పర్యటనల సమాచారాన్ని ఏ రోజుకు ఆ రోజ పత్రికలకు పంపి ప్రచారాన్ని కల్పించడం నా పని. ముఖ్యంగా అమెరికా పర్యటనలు నన్ను చాలా ఇబ్బంది పెట్టాయి. చంద్రబాబు నాయుడు ఉదయం లేచిన దగ్గర నుంచి ఏవో మీటింగ్స్‌లో, పారిశ్రామికవేత్తలతో సమావేశాల్లో పాల్గొనేవారు. ఒక్కోసారి అవి రాత్రి 10 గంటల వరకు జరిగేవి. నేను ప్రతి మీటింగ్‌కూ హాజరై నోట్ చేసుకునేవాడిని, ఫొటోలు తీసుకునేవాడిని. గంపెడు వార్తలు ముందేసుకొని ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు మేం దిగిన హోటల్లోని బిజినెస్ సెంటర్‌కు వెళ్లి, వైట్ పేపర్‌పై న్యూస్ రాసుకొని వరుసగా హైదరాబాద్‌లోని మా కార్యాలయానికి ఫ్యాక్స్ పంపేవాడిని. ఆ కార్యక్రమం రాత్రి ఒంటిగంట వరకు ఒక్కోసారి ఉదయం నాలుగు వరకు కూడా జరిగేది. మా ఆఫీసులో పీఆర్‌ఓలు నాగేశ్వరరావు, చంద్రమోహన్, గోపీనాథ్ తెల్లవారేసరికి ఆఫీసుకు చేరుకుని ఫ్యాక్స్‌లు రిసీవ్ చేసుకుని, టైప్ చేయించి అన్ని పేపర్ ఆఫీసులకు పంపేవారు. అక్కడ పగలైతే ఇక్కడ రాత్రి కదా. అర్ధరాత్రి రూమ్ చేరుకొని కేవలం మూడు నాలుగు గంటలు కునుకు తీసి, మళ్ళీ గబగబా తయారై బాబు గారితో పాటు విమానం ఎక్కి మరో స్టేట్‌కు వెళ్లేవాడిని. ఆ రెండు వారాల పర్యటనలో రాత్రి భోజనం తిన్నది చాలా తక్కువ. చివరికొచ్చేసరికి బాగా అలసిపోయాను. సరైన నిద్ర, ఆహారం లేక బక్కచిక్కి పోయాను. షుగర్ లెవెల్స్ కొండెక్కాయి. అన్ని రోజులున్నా మేము అమెరికాలో పెద్ద పెద్ద బిల్డింగ్స్, హోటల్స్, ఎయిర్‌పోర్టులు తప్ప మరి ఇంకేమీ చూసింది లేదు. ఎలాగైనా అక్కడ ఆగి అమెరికా చూడాలన్న ఆశ కలిగింది. అదృష్టం కొద్దీ నా వెంట రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి అనే పాత్రికేయ మిత్రులు కూడా వచ్చారు. వారే చంద్రబాబు దగ్గరకు వెళ్లి– ఇంకో రెండు వారాలు ఆగి ఇండియా వస్తామని అడిగారు. ఆయన సరేనంటూ తన దగ్గర మిగిలిన కొన్ని డాలర్స్ కూడా మాకు ఇచ్చేసి వెళ్లారు. మిత్రులు సీఎం రమేశ్ సౌజన్యంతో మరో రెండు వారాలు తిరిగాం! సెల్‌ఫోన్ లేని ఆ కాలంలో అన్ని వ్యవహారాలు ల్యాండ్ ఫోన్‌లోనే. ముఖ్యమంత్రి కార్యక్రమాలు ఆ ముందు రోజు రాత్రి 10 గంటలకు, ఒక్కోసారి 12 గంటలకు, ఒక మెసెంజర్ తీసుకువచ్చి, ఇంటి డోర్ వద్ద వేసి వెళ్లేవాడు. ఆ లోపే ప్రధాన పత్రికా రిపోర్టర్లు– సీఎం మరుసటి రోజు కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు ఎడతెగకుండా ఫోన్లు చేసేవారు. అందరికీ జవాబులు చెబుతూ ఏ అర్ధరాత్రో పడుకొని వేకువజామున నాలుగు గంటలకు లేచేవాళ్ళం. సమాచారశాఖ వారు ఒక వాహనం ద్వారా ప్రధాన పత్రిక ఆఫీసులకు నేరుగా వెళ్లి, ఆ దినపత్రికలు తీసుకువచ్చి ఒక సెట్టు నాకు, ఆ తర్వాత ముఖ్యమంత్రి గృహానికి, ఆ తర్వాత సమాచార కమిషనర్ ఇంటికి ఇచ్చేవాళ్ళు. నేను వేకువజాము నుంచి ఒక్కో పత్రికను చూసి, అన్ని రకాల వార్తలు, ముఖ్యంగా సీఎం చర్య తీసుకోవాల్సిన వార్తలన్నీ ఓ పేపర్‌పై రాసుకునేవాడిని. ఉదయం 6:30 గంటలకల్లా ముఖ్యమంత్రి ఇల్లు చేరుకొని, అన్ని టైప్ చేయించి, తొమ్మిది గంటలకు కమిషనర్, నేనూ కలిసి ముఖ్యమంత్రికి వార్తలన్నీ బ్రీఫింగ్ ఇచ్చేవాళ్ళం. ఒక్కోసారి చంద్రబాబు తానే న్యూస్ పేపర్లు తిరగేసి, ఇంటి వద్ద నుంచే ఆ వార్తలకు సంబంధించి ఆయా అధికారులతో గానీ, కలెక్టర్లతో గానీ మాట్లాడేవారు. రానురాను మేం జిల్లా పేపర్లు కూడా తెప్పించుకొని కాస్త ఆలస్యమైనా ఆయనకు బ్రీఫింగ్ చేసేవాళ్లం. చంద్రబాబు గారికి రాష్ట్ర సమగ్ర సమాచారం మొత్తం ఏ రోజుకు ఆ రోజు తెలుసుకోవాలన్న ఆసక్తి వుండేది.

పాఠకులకు, వీక్షకులకు మా తెరవెనుక కష్టం తెలిసేది కాదు. అయినా ఎవరి మెప్పు కోసమో కాకుండా పూర్తి కమిట్మెంట్‌తో పనిచేసేవాళ్ళం. ఒక చిన్న ఉదాహరణ చెప్పాలి. భారతదేశానికి మొదటిసారిగా అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ వచ్చారు. ఆ సందర్భంగా ఆయనకు చంద్రబాబును కలవాలన్న కోరిక కలిగింది. దీనికి ఓ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. ఒకసారి న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ చంద్రబాబునాయుడితో ఇంటర్వ్యూ చేయాలని హైదరాబాద్ వస్తే, నేను అతణ్ని ఒకరోజు చంద్రబాబుతో టూర్‌కు హెలికాప్టర్ ఎక్కించాను. చంద్రబాబు కృషిని కళ్లారా చూసి, అతను న్యూయార్క్ టైమ్స్ పేపర్‌లో ఓ పెద్ద ఆర్టికల్ రాశాడు. ఆ ఆర్టికల్ చదివిన క్లింటన్ తన ప్రెస్ సెక్రెటరీని పిలిచి, ఇండియా టూర్‌లో చంద్రబాబును కలిసే ప్రోగ్రాం పెట్టాలని ఆదేశించారు. అలా ఆయన హైదరాబాద్ వచ్చారు. క్లింటన్, చంద్రబాబు కలిసి కారులో పర్యటిస్తూ, గంటకుపైగా వివిధ అంశాలను చర్చించుకున్నారు. ఆ రోజు క్లింటన్‌కు వీడ్కోలు చెప్పి, చంద్రబాబు ఇంటికి వెళుతూ నాకు ఫోన్ చేసి, వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను దాదాపు అరగంట పాటు వివరించారు. అప్పటికే చీకటి పడింది. ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ప్రెస్‌నోట్ టైప్ చేసి అందరికీ పంపడం కరెక్ట్ కాదు. ప్రతి ఒక్కరికీ ఫోన్ ద్వారా తెలియజేయాల్సిన పరిస్థితి. అలా నాలుగు గంటలపాటు ప్రతి ఒక్కరికీ, ఒక్క అంశం కూడా మిస్ కాకుండా ఫోన్లో చెప్పి ముగించాను. మరుసటి రోజు అన్ని పేపర్లలో బ్యానర్ వార్తగా ఆ అంశం కనిపించగానే ఆ సంతోషంలో వాయువేగంతో సీఎం ఇంటికి చేరుకున్నా. మా పేషీ వాళ్ల కళ్ళల్లో నేను పడిన కష్టం కనిపించింది. చంద్రబాబు మాత్రం తన ఆనందాన్ని పైకి కనిపించకుండా గుంభనంగా దాచుకున్నారు. నాకైతే ఆయన కళ్ళల్లో బిగబట్టిన ఆనందం కనిపించింది. ఇప్పుడేముంది..! ఇంటర్నెట్, వైఫై ఫోన్లు, కెమెరా ఫోన్లు, స్పీచ్ డిక్టేషన్స్... ఇంకా ఇంకా ఎన్నో వస్తూనే ఉన్నాయి. నిమిషాల్లో ఒక వార్తను ప్రపంచంలోని అన్ని పత్రికలకు, అన్ని చానెల్స్‌కు పంపేయచ్చు. దేశవిదేశాల్లో చంద్రబాబు ప్రోగ్రాంను లైవ్ పెట్టుకొని ఇక్కడే ప్రెస్‌నోట్స్ తయారు చేసుకోవచ్చు. కానీ 1995 నుంచి 2004 వరకు ఆ తొమ్మిదేళ్ల పాటు మేము టెక్నాలజీ లేని కాలంలోనే సమాచార వెలుగులు నింపాం. బిల్ క్లింటన్, పుతిన్ వంటి ఎందరెందరో మహనుభావుల్ని హైదరాబాద్ గడ్డపై కాలు మోపేలా చేశాం.

## పెత్తనం చెలాయించేందుకు
# ఏ సభ్యదేశానికైనా హక్కు ఉందా?



బలప్రయోగం, బెదిరింపుల ద్వారా వెనెజువెలా రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేందుకు లేదా ఆ దేశంపై పెత్తనం చెలాయించేందుకు ఏ సభ్యదేశానికైనా హక్కు ఉందా? అనేదే భద్రతామండలి ముందు ప్రస్తుతం ఉన్న అంశం. ఇది ఐక్యరాజ్యసమితి అధికారపత్రం (చార్టర్) లోని సెక్షన్ 4తో నేరుగా ముడివడివుంది. ప్రపంచ దేశాల ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా బలప్రయోగం లేదా బెదిరింపులకు పాల్పడడాన్ని ఆ నిబంధన నిషేధించింది. ఆ నియమాన్ని సమర్థించి, స్థిరపరచడమా లేక ఉపేక్షించి వదిలివేయడమా అనే విషయమై భద్రతా మండలి నిక్కచ్చిగా నిర్ణయం తీసుకోవాలి. ఆ నిబంధనను ధ్రువీకరించని పక్షంలో తీవ్రమైన పర్యవసానాలు సంభవిస్తాయి.

1947 నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో తమకు ప్రతికూలంగా ఉన్న ప్రభుత్వాలను మార్చివేసి, సానుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు అమెరికా పదేపదే బలప్రయోగం, రహస్య చర్య, రాజకీయ కౌటిల్యానికి పాల్పడింది. 1947–89 సంవత్సరాల మధ్య వివిధ దేశాలలో ప్రభుత్వాల మార్పునకు అమెరికా 70 సార్లు ప్రయత్నించిందని రాజనీతిశాస్త్ర విదుషీమణి Lindsey O' Rourke 2018లో తన పరిశోధనగ్రంథం 'Covert Regime Change'లో విపులంగా వెల్లడించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన అనంతరం కూడా ఈ అధర్మ కార్యకలాపాలను అమెరికా కొనసాగించింది. భద్రతా మండలి అనుమతి, ఆమోదం లేకుండానే అమెరికా 1989 నుంచి ఇరాక్ (2003), లిబియా (2011), సిరియా (2011) నుంచి, హొండురాస్ (2009), ఉక్రెయిన్ (2014), వెనెజువెలా (2002 నుంచి)తో సహా వివిధ దేశాలలో వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చివేసి, అనుకూల పాలకులను అధికారానికి తీసుకువచ్చేందుకు పూనుకుని చాలా వరకు సఫలమయింది. ఇందుకు అమెరికా సువ్యవస్థిత పద్ధతులను అనుసరించింది. బాహాట యుద్ధం, రహస్య గూఢచార కార్యకలాపాలు, అశాంతిని రగుల్కొల్పడం, సాయుధ బృందాలకు మద్దతు ఇవ్వడం, మాధ్యమాలను ఉపయోగించుకోవడం, సైనిక, పౌర అధికారులకు లంచాలు ఇవ్వడం, ప్రతికూల నేతలను హతమార్చడం, ఫాల్స్‌ఫ్లాగ్ కార్యకలాపాలు (యుద్ధానికి సాకులు సృష్టించడం, ప్రత్యర్థి నేతలను అప్రతిష్ఠ పాలుచేయడం, ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా రూపొందించడం మొదలైనవి), ఆర్థికవ్యవస్థను కుదేలుపరచడం మొదలైనవి ఆ పద్ధతులలో కొన్ని. ఈ అధర్మ చరిత్ర అంతా సవివరంగా లిఖితమై ఉంది. ఐక్యరాజ్యసమితి అధికార పత్రం నిర్దేశాలకు ఇవన్నీ పూర్తిగా విరుద్ధమైనవి.

ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలలో కొనసాగుతున్న హింసాకాండలు, సంఘర్షణలు, రాజకీయ అస్థిరత, ప్రజల బతుకులు బుగ్గిపాలు కావడం మొదలైన బాధాకర పరిణామాలన్నీ అమెరికా పాల్పడిన, పాల్పడుతోన్న ఆ అధర్మ చర్యల ఫలితాలే.

వెనెజువెలా విషయంలో ఇటీవల అమెరికా వ్యవహరించిన తీరుతెన్నుల చరిత్ర అందరికీ తెలిసిందే. ఏప్రిల్ 2002లో వెనెజువెలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు గురించి అమెరికాకు ముందుస్తుగా తెలుసు. ఆ చర్యను పూర్తిగా ఆమోదించింది కూడా. 2010 దశకంలో, ముఖ్యంగా 2014లో ప్రభుత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు నిర్వహించిన పౌర సమాజ బృందాలకు ఆర్థిక అండదండలు పుష్కలంగా అందించింది. ఆ నిరసనకారులపై వెనెజువెలా ప్రభుత్వం తీవ్రచర్యలు తీసుకున్నప్పుడు అమెరికా దానిపై అనేక ఆంక్షలు విధించింది. 2017లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశాల సందర్భంగా లాటిన్ అమెరికా నాయకులకు ఇచ్చిన ఒక విందు సందర్భంగా– వెనెజువెలాలో ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకై ఆ దేశాన్ని దురాక్రమించే ప్రతిపాదన గురించి నాటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా చర్చించారు. 2017 నుంచి 2020 వరకు వెనెజువెలా ప్రభుత్వరంగ చమురు సంస్థపై అమెరికా విస్తృత ఆంక్షలు విధించింది. 2016–20 సంవత్సరాల మధ్య వెనెజువెలాలో చమురు ఉత్పత్తి 75 శాతం మేరకు పడిపోయింది. నిజమైన తలసరి జీడీపీ 62 శాతం మేరకు తగ్గిపోయింది. అమెరికా ఏకపక్షంగా వెనెజువెలాకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ చర్యలను ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ పలుమార్లు ఖండించింది. 2019 జనవరి 23న వెనెజువెలా 'తాత్కాలిక అధ్యక్షుడు'గా జువాన్ గువాయిడోను అమెరికా ఏకపక్షంగా గుర్తించింది. ఆ తరువాత అయిదురోజులకు ఆ దేశంలో 700 కోట్ల డాలర్ల సార్వభౌమిక ఆస్తులను అమెరికా స్తంభింప చేసి, తాను గుర్తించిన తాత్కాలిక అధ్యక్షుడికి నిర్దిష్ట ఆస్తులపై అధికారాలు కల్పించింది. వెనెజువెలాకు వ్యతిరేకంగా అమెరికా అటువంటి కార్యకలాపాలకు రెండుదశాబ్దాలకు పైగా నిర్విరామంగా పాల్పడింది.

అమెరికా ప్రపంచవ్యాప్తంగా దుందుడుకు విధానాలనే అనుసరిస్తోంది. గత ఏడాది ఏడు దేశాలపై బాంబు దాడులు నిర్వహించింది. వాటిలో ఏ ఒక్కదానికీ భద్రతామండలి అనుమతి లేదు. ఐక్యరాజ్యసమితి నియమ నిబంధనల ప్రకారం అవేవీ ఆత్మరక్షణకు నిర్వహించిన దాడులు కావు. గత నెలలో అధ్యక్షుడు ట్రంప్ ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు అయిన కొలంబియా, డెన్మార్క్, ఇరాన్, మెక్సికో, నైజీరియా మొదలైన దేశాలపై యుద్ధ చర్యలకు పూనుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వెనెజువెలా కూడా ఆ హెచ్చరికల లక్ష్యంగా ఉంది.

వెనెజువెలాపై అమెరికా జరిపిన దాడి, కొనసాగుతున్న నావికా దిగ్బంధనం స్వేచ్ఛకు దోహదం చేస్తుందా లేదా అణచివేతకు దారితీస్తుందా అనే విషయాన్ని మదింపు చేయాలని భద్రతా మండలి సభ్యదేశాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. అంతర్జాతీయ చట్టాన్ని కాపాడేందుకు, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సంరక్షించేందుకు పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అంతర్జాతీయ చట్టం (సార్వభౌమ రాజ్యాలు, అంతర్జాతీయ సంస్థలు, వ్యక్తుల మధ్య సంబంధాలను నియంత్రించే నియమ నిబంధనల, ప్రమాణాల వ్యవస్థ)ను అనువర్తింపచేయడం ద్వారా రాజ్యాల మధ్య ఘర్షణల నివారణకోసం నానాజాతి సమితిని ఏర్పాటు చేశారు. అయితే ఈ సంస్థ అంతర్జాతీయ చట్టాన్ని కాపాడడంలో విఫలమైన పర్యవసానమే ద్వితీయ ప్రపంచయుద్ధం. ఇది సృష్టించిన ఘోర విషాదాలకు శాశ్వత పరిష్కారంగా ఐక్యరాజ్యసమితి ప్రభవించింది. 'భావితరాలకు యుద్ధ విపత్తు అనేది వాటిల్లకుండా చూడడమే' ఈ అంతర్జాతీయ సంస్థ మహోదాత్త లక్ష్యం. ఇప్పుడు మనం అణుయుగంలో ఉన్నామన్న వాస్తవాన్ని గుర్తుపెట్టుకుని ఇరవయో శతాబ్ది వైఫల్యాలు మరోసారి పునరావృతమవకుండా జాగ్రత్త వహించాలి. ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా మానవాళి మనుగడ సమసిపోతుంది. మరో ప్రత్యామ్నాయ పరిస్థితి ఉండదు, ఉండబోదు.

ఐక్యరాజ్యసమితి చార్టర్ నిర్దేశించిన ఈ బాధ్యతలను నిర్వర్తించేందుకు తక్షణమే భద్రతా మండలి పూచీ వహించాలి. తక్షణ కర్తవ్యాలను పాటించేలా సంబంధిత దేశాలపై ఒత్తిడి చేయాలి; వెనెజువెలాకు వ్యతిరేకంగా ఎలాంటి బెదిరింపులు, దాడులకు పాల్పడకుండా అమెరికాను తక్షణమే నిలువరించాలి; భద్రతా మండలి అనుమతి లేకుండా వెనెజువెలాకు వ్యతిరేకంగా ప్రారంభించిన నావికా దిగ్బంధానికి అమెరికా తక్షణమే ముగింపు చెప్పాలి. ఇతర సైనిక చర్యలను కూడా నిలిపివేయాలి. వెనెజువెలా, దాని పరిసర ప్రాంతాల నుంచి తన సమస్త సైనిక దళాలను అమెరికా తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఉద్రిక్త పరిస్థితుల ఉపశమన బాధ్యత వెనెజువెలాపై కూడా ఉన్నది. ఐక్యరాజ్యసమితి నియమ నిబంధనలకు సంపూర్ణంగా నిబద్ధమవడంతో పాటు విశ్వమానవ హక్కుల ప్రకటన హామీ పడిన హక్కులు అన్నిటినీ కాపాడాలి; వెనెజువెలా ప్రభుత్వంతోను, సంక్షోభంతో ప్రమేయమున్న సమస్త దేశాల ప్రతినిధులతోను చర్చలు, సమాలోచనలు జరిపి ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు అనుగుణమైన సిఫారసులను 14 రోజులలో నివేదించేందుకు ఒక ప్రత్యేక ప్రతినిధిని నియమించాలి. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలన్నీ భద్రతామండలి ఆమోదం లేకుండా ఏకపక్షంగా హెచ్చరికలు జారీ చేయడం, సాయుధ చర్యలకు పూనుకోవడం మొదలైన వాటికి స్వస్తి చెప్పి తీరాలి. అంతర్జాతీయ చట్టం సువ్యవస్థితంగా అమలయ్యేందుకు ఒక స్ఫూర్తిదాయక సాధనంగా ఐక్యరాజ్యసమితి చార్టర్ ఉంటుందా? అన్న దానిపైనే శాంతిసాధన, మానవాళి మనుగడ ఆధారపడి ఉన్నవి. ధన్యవాదాలు.

# కాలుష్యం కోరలు తీసేదెలా?

సంకల్పం ఉంటే దేన్నయినా సాధించవచ్చంటారు. అది కొరవడటం దేశ రాజధాని నగరానికి శాపంగా మారింది. కనుకనే కాలుష్యం అక్కడి నుంచి కదలనంటున్నది. ఈ సంగతి తెలిసే సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం)ను తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన కాలుష్య కారకాలను గుర్తించి, ఏయే పరమాణువులు ఏ మేరకు కారణమవుతున్నాయో, వాటిని అరికట్టడానికి ఏం చేయాలో చెప్పాలని కోరింది. మనం పీల్చే గాలితోపాటే నైట్రేట్‌లూ, సల్ఫేట్‌లూ, కర్బనాలు, కాడ్మియం, పాదరసం వంటి అత్యంత ప్రమాదకర పరమాణువులు ఊపిరితిత్తుల్లో ప్రవేశిస్తున్నాయి.

నెత్తురుతోపాటే శరీరమంతటా ప్రవహిస్తున్నాయి. ఇవన్నీ గుండెపోటు, ఊపిరితిత్తుల క్యాన్సర్, నవజాత శిశు మరణాలూ తదితర దారుణాలకు కారణమవుతున్నాయి. అయినా అన్ని వ్యవస్థలూ కాలుష్యాన్ని ఆషామాషీగా తీసుకుంటున్నాయి. వివిధ అధ్యయనాలు చెబుతున్న దాన్నిబట్టి ఢిల్లీ వరకూ చూస్తే వాహనాల కాలుష్యమే అధికం. ఆ తర్వాత వరసగా పారిశ్రామిక ఉద్గారాలు, నిర్మాణరంగం వల్ల వెలువడే ధూళి, పంట వ్యర్థాలు తగలబెట్టినందువల్ల వచ్చే పొగ ఉంటాయి. కానీ నిర్దిష్టమైన డేటా లేనందువల్ల అరికట్టడం విషయంలో వెనకబడిపోతున్నాం.

రెండు దశాబ్దాల క్రితం చైనా రాజధాని నగరం బీజింగ్ పరిస్థితి ఇదే. 2008లో బీజింగ్ ఒలింపిక్స్ జరుగుతున్న సందర్భంగా ఆ దేశం తొలిసారిగా కాలుష్యంపై రణభేరి మోగించింది. పలు తాత్కాలిక చర్యలు ప్రారంభించారు. అటుతర్వాత అయిదేళ్ల పాటు అధ్యయనాలు నిర్వహించారు. వాటితోపాటే ప్రయోగాత్మకంగా వివిధ రకాల విధానాలు అమల్లోకి తెచ్చారు. ప్రధాన కాలుష్య కారకాలను గుర్తించారు. వాటి తీవ్రత ఆధారంగా వర్గీకరించారు. వాతావరణంలో అతి సూక్ష్మ ధూళి కణాల (పీఎం 2.5)ను సాధ్యమైనంత మేర తగ్గించాలని సంకల్పించారు. అటు తర్వాత 2013లో అయిదేళ్ల జాతీయ కార్యాచరణ పథకం రంగప్రవేశం చేసింది. బొగ్గు ఆధారిత బాయిలర్లను మూసివేయాలని నిర్ణయించటంతోపాటు ప్రజా రవాణా వ్యవస్థను అంచెలంచెలుగా మెరుగుపరిచారు. వివిధ పరిశోధనల ద్వారా కొత్త సాంకేతికతల్ని ఆవిష్కరించారు. హరిత ఇంధన వాడకమే వీటన్నిటి ధ్యేయం. కనుకనే అత్యంత కాలుష్య ప్రాంతాలుగా గుర్తించినవి కాస్తా నాలుగేళ్లలో గణనీయంగా మెరుగుపడ్డాయి. ఈ మెరుగుదల 35 శాతంపైగా ఉంది. మధ్యలో కరోనా మహమ్మారి విరుచుకుపడినా కాలుష్యంపై పోరు ఎక్కడా తగ్గలేదు. చైనా మాత్రమే కాదు... మనకన్నా బాగా వెనకబడిన ఫిలిప్పీన్స్, పెరూ, ఉరుగ్వే వంటి దేశాలు సైతం కాలుష్యాన్ని అరికట్టడంలో మెరుగైన విజయాలు సాధించాయి.

ఒక్క ఢిల్లీ అనేమిటి... హైదరాబాద్ మొదలుకొని పది నగరాల వరకూ దాదాపు ప్రతిచోటా ఏడాది పొడవునా కాలుష్యం బుసలు కొడుతోంది. 2022 జూలైలో సీఏక్యూఎం వెలువరించిన నివేదిక రవాణా రంగం, పారిశ్రామిక ఉద్గారాలు, విద్యుత్ ప్లాంట్‌లు, వ్యర్థాల్ని తగలబెట్టడం, నిర్మాణరంగ పనుల వల్ల వెలువడే ధూళి వగైరాలు ప్రధానంగా కాలుష్యానికి కారణమవుతున్నాయని గుర్తించింది. కానీ వాటిని అరికట్టడానికి లేదా వాటి తీవ్రత తగ్గించటానికి జరిగిన కృషేమీ లేదు. ఈ విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటో సూచించాలంటూ గత నెల 17న సీఏక్యూఎంను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పుడు మళ్లీ మరోసారి చెప్పాల్సివచ్చింది. సీఏక్యూఎం ఒక్కటే దీన్ని సాధించటం సాధ్యంకాదు. అన్ని విభాగాలూ కలిస్తేనే సమస్యపై పోరాడటానికి వీలవుతుంది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సీఏక్యూఎం పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీస్, రవాణా విభాగం, మున్సిపాలిటీలు, కాలుష్య నియంత్రణ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా నిర్దిష్టమైన విధానం రూపొందించాలి. పకడ్బందీ కార్యాచరణ ఉండాలి. పొరుగునున్న చైనా నిర్దిష్టమైన కాలపరిమితి పెట్టుకుని లక్ష్యాన్ని సాధించగలిగినప్పుడు... మనకన్నా వెనకబడిన దేశాలు సైతం చేసి చూపిస్తున్నప్పుడు మనం ఎందుకు విఫలమవుతున్నామని ప్రశ్నించుకోవాలి.



# ఇంటి నిర్మాణానికి చేయూత

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికీ చెందిన చాట్ల జ్యోతి ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్త లు చేయూతనందించారు. శుక్రవారం జ్యోతి ఇంటి నిర్మాణానికి 5 కింటాళ్ళ ఐరన్ సామగ్రి, 30 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేదలను ఆదుకోవడమే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, గంప వెంకటేష్ గుప్త లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాల్ కోట నర్సింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు లాల్ కోట జంగయ్య, వైస్ ప్రెసిడెంట్ సాబేర్ మరియు వార్డు సభ్యులు జంగమ్మ రాములు, అంజి నాయక్ తదితరులు ఉన్నారు.






# రంగవల్లులు.. సంస్కృతికి ప్రతీకలు

**- ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము**
**- వివేక విద్యా భారతిలో ముందస్తు సంక్రాంతి వేడుకలు**

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** సంక్రాంతి పండుగ తెలుగు వారి లోగిల్లో ఇంటింటా తెలుగుదనం ఉట్టిపడే విధంగా ఉందని ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని వివేక విద్యా భారతి పాఠశాలలో ఆ పాఠశాల కరస్పాండెంట్ గోలీ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను చిన్నారులతో అత్యంత తెలుగుదనం ఉట్టిపడే విధంగా ఏర్పాటు చేపట్టారు. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా.. ముగ్గులతో సంబరాలు చేశారు. విద్యార్థినిలు రంగు రంగుల రంగవల్లులు, పాల పొంగులతో ముగ్గులు, హరిదాసుల హరిహర నామస్మరణలతో గొబ్బెమ్మలను అలంకరించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము, పాఠశాల గౌరవ అధ్యక్షులు డాక్టర్ పుల్లయ్య విద్యార్థుల బృందంతో కలిసి భోగి మంటలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పండుగను సంస్కృతి సాంప్రదాయాలు మర్చిపోతున్న తరుణంలో.. వివేక విద్యా భారతి పాఠశాల యాజమాన్యం కనువిందు చేసే విధంగా సంస్కృతిని కాపాడుతూ భవిష్యత్తు చిన్నారులకు తెలియజేయడం శుభ సూచకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజ్రా, మల్లేష్, స్వప్న, అరుణ, షమీమ్, రత్నకుమారి, నజీర్, మీనా, స్వాతి తదితరులు ఉన్నారు.



# గ్రీన్ ఫీల్డ్ నిర్వాసితులకు ప్రభుత్వం ఆదుకోవాలి

**- మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు సర్వేను అదే విధంగా భూసేకరణ తక్షణమే నిలిపివేయాలి హెచ్చరించారు. శుక్రవారం కడ్తాల్ మండలంలో చేపట్టిన భూ సర్వేన ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతన్నలకు సరైన పరిహారం పునరావాసం కల్పించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని లేనియెడల రైతుల పట్ల నిలిచి భూములు కోల్పోతున్న రైతన్నల కోసం నిరాహార దీక్షకైనా వెనకాడనని దశరథ్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శీను నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహా రెడ్డి, మాజీ డైరెక్టర్ జోగు వీరయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ ముత్యాలు, నాయకులు రాఘవరెడ్డి, జంగయ్య, శంకరయ్య, శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లయ్య, బిక్షపతి, శివ, చంద్రయ్య, వెంకటయ్య, యాదయ్య రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మానసిక ఉల్లాసానికి క్రీడలు

**- మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్**

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని మాజీ జడ్పీటీసీ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలోని సాలార్ పూర్ గ్రామం అదేవిధంగా రేఖ్య తండాలో స్థానిక సర్పంచులు ప్రియా రమేష్ నాయక్, లక్ష్మీబాయి శ్రీధర్ నాయక్ తో కలిసి క్రికెట్ టోర్నమెంట్ ను జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడకారులతో పరిచయం చేసుకొని టాస్ వేశారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సరదాగా బ్యాటింగ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి, మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని చెప్పారు. ఈ పోటీలలో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం విద్య, ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్వరి కుమార్, దేవ్ నాయక్, మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, వార్డు సభ్యులు జైపాల్, మల్లేష్, రమేష్, శ్రీశైలం నాయకులు హనుమంతు, కోటియా, కృష్ణ, సంతోష్, అంజాద్, తస్లీమ్, దాస్య, అనిల్, గోపాల్, సిలారి రాజు, శీను, వినోద్, రవికుమార్, అనిల్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ ఆప్టోమెట్రిస్ మల్లేష్ తెలిపారు. హైదరాబాద్ పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో శుక్రవారం పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఆప్టికల్లో సుమారు 78 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు అప్టోమెట్రిస్ట్ మల్లేష్ తెలిపారు. సుమారు 35 మందికి కంటి వైద్య చికిత్సలు నిర్వహించినట్లు, ప్రతి ఒక్కరికి మెరుగైన కంటి చూపు వచ్చేవరకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



# ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచ్ శ్రీను నాయక్**

మందులను అందజేస్తున్న సర్పంచ్ శ్రీను నాయక్

**ఆమనగలు జనవరి 9 (అక్షర గళం):** ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని సర్పంచ్ శ్రీను నాయక్ కోరారు శుక్రవారం రాంనుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని కోనాపూర్ గేట్ తాండలో రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ శ్రీను నాయక్ ప్రారంభించారు. శిబిరంలో ఎదకు వచ్చిన పాడి పశువులకు కృత్రిమ గర్భాధారణ చేశారుఎదకు రాని పశువులకు చికిత్స లు నిర్వహించారు లేగదూడలు దుడ్డేలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్, వార్డు సభ్యులు బలరాం నాయక్, మండల పశువైద్య అధికారి డా విజయ్, రంగారెడ్డి పశుగణాభివృద్ధి సంస్థ డా శ్రీకర్ రెడ్డి, గోపాల మిత్రులు హరీష్, ప్రకాష్ , పశు వైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, రైతులు పాల్గొన్నారు.




# పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- ఉప్పల వెంకటేష్**

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామంలోని సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ సర్పంచ్ శానమోని సత్యం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి మాట్లాడుతూ.. సర్పంచులు గ్రామానికి ప్రథమ పౌరుడని అన్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారి ఐదేళ్ల పదవీ కాలంలో మంచి పనులు చేసి చిరస్థాయిగా గ్రామంలో పేరు నిలిచిపోయేలా చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కువ శాతం బీదలు గ్రామాలలోనే ఉన్నారని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయకుండా మంచి పనులు చేయాలన్నారు.



# ఆలయ నిర్మాణానికి విరాళం

**వెల్దండ జనవరి 09 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలోని కొత్తగా నిర్మిస్తున్న శివాలయం ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామ ఉప సర్పంచ్ చెర్క కొండల్ రూపాయలు 50,116 విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు ప్రభాకర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి వీరారెడ్డి రాజేందర్ రెడ్డి డీలర్ మైసయ్య మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్ చంద్రమౌళి చారి యాదయ్య గిరి శంకర్ శశిధర్ నరసింహ బిక్షపతి చారి విజేందర్ చారి యాదయ్య లాలయ్య రమేష్ సందీప్ బాలయ్య జంగయ్య వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ తోనే సాధ్యం

**- మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు**
**- సీనియర్ నాయకులు పూసలి సత్యం**

**ఆమనగల్లు, జనవరి 09 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూసలి సత్యం అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఆ పార్టీ నాయకులు, కాలనీ వాసులతో కలిసి గుర్రం కేశవులు, సత్యం పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి ల సహకారంతో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని



అన్ని వార్డుల్లో అభివృద్ధిలో ప్రగతి కాంతులు పెట్టిస్తామని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, ఉచిత విద్యుత్తు, మహిళా సంఘాలకు రుణాలు వంటి పథకాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కేశవులు, సత్యం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, పూసలి వెంకటేష్, శ్రీనివాసులు, అబ్దుల్ అలీం, ఫరీద్, నాజర్, దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్, నరేందర్, జంగయ్య, గణేష్, కిరణ్, వెంకటేష్, రమేష్, భాస్కర్ గౌడ్, ధనమ్మ, అనసూయ, నవనీత, కాలి సంధ్యారాణి, వెంకటమ్మ, లక్ష్మమ్మ, బాలమ్మ, కమల, వరలక్ష్మి, బుజ్జి, వసంత తదితరులు ఉన్నారు.






# డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టాలి ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత

# సైబర్ నేరాల పట్ల అక్రమతంగా ఉండాలి

**కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**

**కల్వకుర్తి జనవరి 9 (అక్షర గళం):** నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం కల్వకుర్తి మండల పరిధి లోని మాచర్ల గ్రామంలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో రోడ్డు భద్రత మహోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత సైబర్ నేరాల మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాల గురించి గ్రామంలో ర్యాలీని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాధవరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఆ భూతంలో పోయి ఎవరి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రమాదాలను అరికట్ట వచ్చాని సైబర్ నేరగాల మోసాలలో చిక్కుకోవద్దని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషనరి ఎస్సై వివేక్ జడ్పీహెచ్ఎస్ మాచర్ల హెడ్మాస్టర్ వెంకట్ రాములు గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి వార్డు సభ్యులు గ్రామంలోని 300 విద్యార్థులు ర్యాలీలో పాల్గొని అవగాహన కార్యక్రమం లో పాల్గొన్నారు.






# జనవరి 18న ఖమ్మంలో జరుగు సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహ**

**కల్వకుర్తి జనవరి 9 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణం లోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం భారత గడ్డపై సిపిఐ కి వందేళ్లు నిండిన సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభ గోడ పత్రికలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టు వాపక్ష పార్టీలు మరింత బల పడాలని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు, సహాయ కార్యదర్శి ధార దాసు, ప్రేమ్ కుమార్, శివ, మండల నాయకులు గడ్డం శ్రీను, నేరటి రాజు, రవీందర్, వీరేశం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ని కలిసిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్

**కల్వకుర్తి జనవరి 9 (అక్షర గళం):** టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ను శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పట్టు సాధించిందని రాజకీయపర అంశాలపై కేటీఆర్ కు చర్చించారు పార్టీని మరింత బలోపితంగా కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీ లతోపాటు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించినట్లు ఉప్పల వెంకటేష్ తెలిపారు.



# “సైబర్ బాధితులకు డిజిటల్ కవచం...‘సీమిత్ర’ సేవలు

### ఇక హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో
### సైబర్ బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేదు
### ‘సీమిత్ర’తో ఇంటి నుంచే ఎఫ్ఐఆర్
### దేశంలోనే తొలిసారి వర్చువల్ పోలీస్ విధానం
### ఏఐతో ఫిర్యాదు తయారీ... పోస్టుతో ఎఫ్ఐఆర్
### 1930కు కాల్ చేస్తే మీకే కాల్ చేసే పోలీస్
### 3 లక్షల లోపు కేసులకు జీరో ఎఫ్ఐఆర్
### సైబర్ మోసాలకు టెక్నాలజీతో ఎదురుదాడి




**అక్షరగళం, హైదరాబాద్ :** డిజిటల్ మోసాల ముప్పు రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో సైబర్ నేర బాధితులకు గట్టి భరోసా కల్పించేలా హైదరాబాద్ పోలీసులు విప్లవాత్మక వ్యవస్థను అమలు చేశారు. ‘సీ మిత్ర’ పేరుతో ప్రారంభించిన ఈ వర్చువల్ హెల్ప్‌డెస్క్ ద్వారా ఇకపై సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడం నుంచి ఎఫ్ఐఆర్ నమోదు వరకూ అన్నీ ఇంటి నుంచే పూర్తి చేసుకోవచ్చు. ఇది దేశంలోనే తొలిసారి అమలులోకి వచ్చిన విధానం కావడం విశేషం. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ బాధితులు ఈ సేవల్ని ఉపయోగించుకోవచ్చు.

**స్టేషన్‌కు వెళ్లకుండానే..**

సైబర్ మోసం జరిగితే బాధితులు ఇప్పటివరకు 1930కు ఫోన్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం మాత్రమే చేయగలిగేవారు. కానీ ఎఫ్ఐఆర్ నమోదు కోసం తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చేది. సీమిత్ర తో ఆ సమస్యకు తెరపడింది. 1930కు కాల్ చేస్తే, సీమిత్ర బృందంలోని వర్చువల్ పోలీస్ ఆఫీసర్లు బాధితుడికి స్వయంగా ఫోన్ చేసి, ఫిర్యాదు నమోదు ప్రక్రియను పూర్తిగా వర్చువల్‌గా నిర్వహిస్తారు. ఫిర్యాదులో ఏమి రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అన్న సందేహాలు ఇక అవసరం లేదు. సీమిత్ర బృందం ఏఐ టెక్నాలజీ సహాయంతో బాధితుడి వివరాలను సేకరించి, చట్టబద్ధంగా సరైన ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను తయారు చేసి పంపిస్తుంది. బాధితుడు దానిని ప్రింట్ తీసుకుని సంతకం చేసి పోస్టు, కొరియర్ లేదా సైబర్ క్రైం స్టేషన్‌లోని డ్రాప్ బాక్స్ ద్వారా పంపిస్తే సరిపోతుంది.

**3 లక్షల లోపు కేసులకు జీరో ఎఫ్ఐఆర్**

సీమిత్ర విధానంలో 3 లక్షల రూపాయల లోపు సైబర్ మోసాలపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేస్తారు. 3 లక్షలకు మించిన కేసులు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లోనే నమోదు చేస్తారు. దీని వల్ల ఫిర్యాదులు ఆలస్యం కాకుండా చట్టపరమైన ప్రక్రియ మొదలవుతుంది. 1930 మరియు సైబర్ పోర్టల్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఇప్పటివరకు కేవలం 18 శాతం మాత్రమే ఎఫ్ఐఆర్‌లుగా మారుతున్నాయి. సీమిత్ర ద్వారా ఈ శాతాన్ని 100కు తీసుకెళ్లాలనే లక్ష్యంతో హైదరాబాద్ పోలీసులు ఈ వ్యవస్థను రూపొందించారు. దీనివల్ల బాధితులకు న్యాయం వేగంగా అందడమే కాకుండా, పోలీసులకు దర్యాప్తుపై పూర్తి దృష్టి పెట్టే అవకాశం లభిస్తుంది.

**నకిలీ కాల్స్ పట్ల హెచ్చరిక**

సీమిత్ర కాల్స్ కేవలం 04041893111 నుంచే వస్తాయని పోలీసులు స్పష్టం చేశారు. వాట్సాప్ మెసేజ్‌లు 87126 సిరీస్ నుంచే వస్తాయి. సీమిత్ర సిబ్బంది ఎప్పటికీ ఓటీపీలు, డబ్బులు అడగరని , మోసపూరిత కాల్స్ కు స్పందించి మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు పోలీసులు.



సి మిత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపి సజ్జనార్, ఇతర పోలీసు అధికారులు



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**వెల్దండ జనవరి 09 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన కేశమోని జంగయ్య కు పేరిట మంజూరైన 40,500 వేల రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కు కాటిక సురేష్ కు పేరిట మంజూరైన 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్ అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో గానో తోడ్పాటు నందిస్తుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేర్క రాజశేఖర్ అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ సభ్యులు కాటిక వెంకటమ్మ లక్ష్మి నాయకులు చంద్రమౌళి జంగయ్య బాలయ్య బ్రహ్మం ఏకుల భీమరాజ్ యాదయ్య పర్వతాలు బాలస్వామి దాసరి సాయిబాబు బాలకృష్ణ నరసింహ మహేష్ రమేష్ ఆంజనేయులు నాగార్జున్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు



# జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారిని మర్యాదపూర్వకంగా కలిసిన గుండాల గ్రామ బిజెపి వార్డు మెంబర్లు

**వెల్దండ జనవరి 09 (అక్షర గళం):** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామం నుండి బిజెపి వార్డ్ మెంబర్లు గా ఎన్నికైన కొమ్ము రామకృష్ణ,పెరుమాళ్ళ మనీషా సైదులు, కొమ్ము ఆంజనేయులు, జాతీయ బిసి మాజీ కమిషన్ సభ్యులు ఆచారి గారిని మరియు బిజెపి నాయకులు గువ్వల బాలరాజ్ మర్యాదపూర్వకంగా కలసి శాలువలతో సన్మానించి అదేవిధంగా గుండాల గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని తోడ్పడే విధంగా కృషి చేయాలని వారికి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉండే సహకరిస్తానని ఆచారి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ బూత్ అధ్యక్షులు భోజరాజ్ మల్లేష్, కొమ్ము జంగయ్య, శ్రీను, మహేష్, మల్లేష్, రమేష్, మాధవ్, ఏకుల లింగమయ్య, మెండే మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సభలతో సమస్యలు పరిష్కరించుకుందాం..

## సర్పంచ్ రమేష్ నాయక్

**వెల్దండ జనవరి 09 (అక్షర గళం):**

వెల్దండ మండల పరిధిలో ని పలుకు తండా గ్రామంలో సర్పంచ్ సభావాత్ రమేష్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, గ్రామ సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామసభలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల గురించి చర్చించారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణ , భవిష్యత్ ప్రణాళిక అంశాల గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. ఎంపీఓ లక్ష్మణ్, ఉప సర్పంచ్ అనిత పంతు, వార్డు సభ్యులు వెంకటయ్య, బీమా, శాంతి, అంజా, శిరోలి, కృష్ణ, శారద, శ్రీను, సంతోష్, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్, మేటి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు



# అధునాతన సౌకర్యములతో జిల్లా ఆసుపత్రికి పరికరాలు అందజేత

**అక్షర గళం, మల్కాజ్గిరి :**

మల్కాజ్గిరి జిల్లా ఆసుపత్రిలో జన కళ్యాణ సమాఖ్య, జె కె ఎస్. మిత్సుబిషి ఎలివేటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సి ఎస్ అర్ సహాయ సహకారములతో జిల్లా ఆసుపత్రికి అధునాతన సౌకర్యములతో ఆపరేషన్ థియేటరులో వైద్యసౌకర్యం కొరకు పరికరములు అందించారు.. ఈ కార్యక్రమంలో మిత్సుబిషి నుంచి రీజినల్ హెడ్ ముహిదీన్ అబ్దుల్ ఖాదర్, అడ్వైజరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్ , సిబ్బంది, జిల్లా ఆసుపత్రి సూపరింటెండ్ డా. సునీత, జి జి హెచ్ సూపరింటెండ్ డా. రాధ, ఎ ఒ డా. సంగీత్, అర్ ఎం ఓ డా. శివకిరణ్ , మెడికల్ సిబ్బంది, అదే విధముగా జన కళ్యాణ సమాఖ్య జె కె ఎస్ నుండి సి ఇ ఒ అయినటువంటి నిధిల్ వర్గీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సుజుకీ ఇయాక్సెస్ ధర రూ.1.88 లక్షలు



సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన తొలి విద్యుత్ స్కూటర్‌ను దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. తన విజయవంతమైన మోడల్ యాక్సెస్‌ను.. ఎలక్ట్రిక్ వెర్షన్‌లో ఇయాక్సెస్ పేరుతో లాంచ్ చేసింది. కంపెనీ తన గురుగ్రామ్ ప్లాంట్‌లో దీన్ని తయారు చేయనుంది. ఎలక్ట్రిక్ స్కూటర్ల మార్కెట్‌లో బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టాతో ఇది పోటీ పడనుంది.
సుజుకీ ఇయాక్సెస్‌లో 3.07 kWh లిథియం ఐరన్ పాస్ఫేట్ బ్యాటరీని అమర్చారు. ఇది సింగిల్ ఛార్జ్‌తో 95 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఈ స్కూటర్‌లో 4.1kW ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చారు. ఇది 15 Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పోర్టబుల్ ఛార్జర్‌తో 080 శాతం ఛార్జింగ్‌ను 4 గంటల 30 నిమిషాల్లో ఛార్జ్ చేయొచ్చని కంపెనీ పేర్కొంది. ఫాస్ట్ ఛార్జర్‌తో అయితే పూర్తి బ్యాటరీని ఛార్జ్ చేయడానికి 2 గంటల 12 నిమిషాల సమయం పడుతుందని కంపెనీ వెల్లడించింది. టాప్ స్పీడ్ గంటకు 71 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది.

**ఒక ఛార్జింగ్‌తో 810 కి.మీ... వోల్వో విద్యుత్తు ఎస్‌యూవీ ఈఎక్స్ 60**

ఇందులో పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటల్ కన్సోల్ ఉంది. దీంట్లో ఎకో, రైడ్ ఏ, రైడ్ బి మోడ్‌లు ఉన్నాయి. రీజనరేటివ్ బ్రేకింగ్, రివర్స్ మోడ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. బ్లూటూత్/యాప్ కనెక్టివిటీ ఉన్నాయి. యూఎస్‌బీ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఎల్ ఈడీ లైట్స్ ఇచ్చారు. మొత్తం నాలుగు కలర్ ఆప్షన్లలో లభిస్తోంది. గతేడాది భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో దీన్ని తొలిసారిగా ప్రదర్శించారు. సుజుకీ డీలర్‌షిప్‌లతో పాటు ఫ్లిప్‌కార్ట్‌లో కూడా ఆర్డర్ చేయొచ్చు. ఏడేళ్లు లేదా 80వేల కిలోమీటర్ల వరకు వారెంటీ, సుజుకీ కస్టమర్లకు రూ.10వేల వరకు లాయల్టీ బోనస్, ఇతర వినియోగదారులకు రూ.7వేలు వెల్‌కం బోనస్ ఇస్తున్నారు. 5.99 శాతం వడ్డీ రేటుతో ఫైనాన్సింగ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి.

## అసభ్య కంటెంట్ వివాదం.. గ్రోక్ చాట్‌బాట్‌పై పరిమితులు




లండన్: ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్ బాట్ 'గ్రోక్' ఇమేజ్ జనరేషన్‌పై పరిమితి విధించింది. ఈ వేదికగా అశ్లీల, అసభ్యకర దృశ్యాల క్రియేట్ అవుతున్నాయి అంటూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఇమేజ్ జనరేషన్ ఫీచర్‌ను ప్రీమియమ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే పరిమితం చేసింది. అంటే డబ్బులు చెల్లించేవారు మాత్రమే ఈ ఫీచర్‌ను ఉపయోగించేలా నిర్ణయం తీసుకుంది. మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ అనుసంధానంగా ఉన్న గ్రోక్ సాయంతో ఇటీవల కొందరు అసభ్యకర చిత్రాలు సృష్టించారు. మహిళల ఫొటోలను ఇబ్బందికరంగా మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి పోస్టులను తొలగించాలని ఎక్స్‌ను భారత ప్రభుత్వం ఆదేశించింది. యూరోపియన్ యూనియన్, మలేసియా, ఫ్రాన్స్, బ్రెజిల్ ప్రభుత్వాల నుంచీ ఇదే తరహా ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎక్స్ చర్యలు చేపట్టింది.

## టెంపుల్ డివైజ్‌పై వివాదం.. స్పందించిన జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్



జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ ఇటీవల తన కణతపై ఒక స్పెషల్ డివైజ్‌తో కనిపించారు. దాన్ని టెంపుల్ డివైజ్ అంటారని కూడా చెప్పారు. ఈ హెల్త్ టెక్ పరికరంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎయిమ్స్ డాక్టర్లు కూడా ఈ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా దీనిపై దీపిందర్ ఎక్స్‌లో వివరణ ఇచ్చారు.
''మా 'టెంపుల్' డివైజ్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. పనితీరు, ప్రమాణాలపై ఎలాంటి డేటా విడుదల చేయలేదు. దీనిని ప్రజల ముందుకు తీసుకురావడానికి కొంత సమయం పడుతుంది. పూర్తిగా పరీక్షించని, ధ్రువీకరించని, ఆమోదం పొందని పరికరాన్ని కొనుగోలు చేయొద్దని కొందరు సూచిస్తుండటం వింతగా ఉంది. డివైజ్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని మేం భావించినప్పుడు.. దాని వెనక ఉన్న శాస్త్రీయతను వివరిస్తాం. అప్పుడు మీ సూచనలు ఇవ్వండి. అప్పటివరకు ఆసక్తిగా ఎదురుచూడండి. భారత స్టార్టప్‌లను వీలైనంతగా ప్రోత్సహించండి'' అని దీపిందర్ పేర్కొన్నారు.

**సుజుకీ ఇ-యాక్సెస్ వచ్చేసింది.. ధర రూ.1.88 లక్షలు**

టెంపుల్ పరికరం గురించి కొన్ని రోజుల క్రితం గోయల్ ఒక పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. ఇది మెదడులో రక్తప్రసరణ వివరాలను గుర్తిస్తుందని, ఏదైనా ఒత్తిడి కలిగినప్పుడు శరీరంలో వచ్చే మార్పులను తెలియజేస్తుందని తెలిపారు. శరీర స్థితిగతులను బట్టి మెదడు ఎలా స్పందిస్తుందనేది ముందుగానే పసిగట్టడం వల్ల నివారణ మార్గాలవైపు దృష్టి సారించే వీలు కలిగే అవకాశం ఉందని తెలిపారు.


## విమాన తయారీలోకి అదానీ గ్రూప్!

బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్, మనదేశంలో విమానాల రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకవసరమైన తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయడం కోసం, అదానీ గ్రూప్‌తో ఎంబ్రాయర్, ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. భారత విమాన రంగంలోని భారీ అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం ఎంబ్రాయర్ గత అక్టోబరులో దిల్లీలో తన కార్యాలయాన్ని నెలకొల్పింది. ఎంబ్రాయర్‌తో ఒప్పందం ద్వారా భారత్‌లో విమానాల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్ అడుగుపెట్టినట్లయింది. ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు నిమిత్తం ఎంబ్రాయర్‌తో ఇటీవలే అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదానీ, ఎంబ్రాయర్‌ల నుంచి ఈ విషయంపై అధికారిక స్పందన రాలేదు. 'విమానయాన రంగంలో అతితక్కువ ప్రతిఫలం లభించే మార్కెట్లలో భారత్ ఒకటి. ఇక్కడ నిర్వహణ ఖర్చులు ఎంత తక్కువగా ఉండి, అంత ఎక్కువమందిని చేరవేయగలిగితేనే మనుగడ ఉంటుంది. 146 మంది ప్రయాణించేందుకు అనువైన తమ ఈ195ఈ2 విమానం ఈ విపణికి ఎంతో అనువైనద'ని ఎంబ్రాయర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాల్ విలరాన్ తెలిపారు.




# 25,700 దిగువకు నిఫ్టీ

**ముంబయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ప్రభావం చూపాయి. ముఖ్యంగా రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 25,700 దిగువకు చేరింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,200 పాయింట్లకు పైగా పతనమైంది.
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టు నేటి (శుక్రవారం) రాత్రి తీర్పు వెలువరించనుంది. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వస్తే మన మార్కెట్లకు ఊరట కలుగుతుంది. అనుకూలంగా తీర్పు వస్తే ఆయా దేశాలపై మరిన్ని టారిఫ్‌లు విధించేందుకు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఇది మార్కెట్లకు ప్రతికూల అంశం. ఈ నేపథ్యంలో ఈ వారాంతంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు.
సెన్సెక్స్ ఈ రోజు ఉదయం 84,022.09 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,180.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత మరింత అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇంట్రాడేలో 83,402.28 వద్ద కనిష్ఠాలను తాకిన సూచీ.. చివరకు 604.72 పాయింట్ల నష్టంతో 83,576.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 193.55 పాయింట్ల నష్టంతో 25,683.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా




ఉంది.
సెన్సెక్స్ 30 సూచీలో ప్రధానంగా ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్, రిలయన్స్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.12 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,471 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# చిన్నారుల భవితకు ఫండ్ల తోడు

తల్లిదండ్రులుగా మనకున్న అతి పెద్ద బాధ్యత పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం. ఇప్పుడు ఎల్‌కేజీ ఫీజులు చూస్తేనే భయమేస్తోంది. మరి, రేపు పిల్లల ఉన్నత చదువుల ఖర్చులు ఏ స్థాయికి చేరతాయో ఊహించగలమా? విద్యా ద్రవ్యోల్బణం ఏటా 10 12 శాతం పెరుగుతోంది. దీన్ని జయించి, పిల్లల కలలను నిజం చేయాలంటే.. సంప్రదాయ పొదుపు మార్గాలు సరిపోవు. అందుకే, చిల్డ్రన్స్ మ్యూచువల్ ఫండ్‌లాంటివి ఎంచుకోవాల్సిన అవసరం ఉంది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం మ్యూచువల్ ఫండ్లలో అనేక రకాలున్నాయి. ఇందులో పిల్లల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ప్రత్యేకంగా రూపొందించినవే ఈ 'సొల్యూషన్ ఓరియెంటెడ్' పథకాలు. ఇవి కేవలం డబ్బు దాచుకోవడానికే కాదు.. ఒక నిర్ణీత లక్ష్యం కోసం ఉద్దేశించినవి. ఇవి ప్రధానంగా రెండు రకాలు..
**హైబ్రిడ్ ఫండ్లు:** ఈక్విటీ (షేర్లు), డెట్ (బాండ్లు) రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి. నష్టభయం తక్కువగా ఉండాలని కోరుకునే వారికి ఇవి సరిపోతాయి.
**ఈక్విటీ ఫండ్లు:** పూర్తిగా షేర్లలోనే మదుపు చేస్తాయి. స్వల్పకాలంలో కాస్త నష్టభయం ఉన్నా, దీర్ఘకాలంలో మంచి లాభాలకు ఆస్కారం ఉంటుంది. వీటిలో ఉండే అతి ముఖ్యమైన నిబంధన.. లాకిన్ పీరియడ్. వీటిలో పెట్టుబడిని కనీసం 5 ఏళ్లు లేదా పిల్లలకు 18 ఏళ్లు నిండే వరకూ (ఏది ముందైతే అది) కొనసాగించాలి. అప్పటి వరకూ ఈ పథకాల్లో నుంచి డబ్బు వెనక్కి తీయడం కుదరదు. పిల్లల ఫండ్లలో మదుపు చేయడం చాలా సులభం. పెట్టుబడి కచ్చితంగా పిల్లల పేరుమీదే ఉండాలి. తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ పెట్టుబడి ఖాతాను నిర్వహిస్తారు.
కేవైసీ నిబంధనల కోసం తల్లిదండ్రుల/సంరక్షకుల పాన్, ఇతర పత్రాలు కావాలి.
పిల్లల పేరుమీద బ్యాంకు ఖాతా ఉంటే మంచిది. లేకపోయినా తల్లిదండ్రుల ఖాతా నుంచి సిప్ చేయొచ్చు. గడువు తీరాక డబ్బు వెనక్కి తీసుకునేటప్పుడు కచ్చితంగా పిల్లల ఖాతాలోనే జమ అవుతుంది. గతంలో పిల్లల తల్లిదండ్రుల ఖాతా నుంచి మాత్రమే డబ్బు కట్టాలనే నిబంధన ఉండేది. కానీ ఇప్పుడు సెబీ వీటిని సడలించింది. తాతయ్యలు, అమ్మమ్మలు కూడా మనవళ్ల/మనవరాళ్ల



మ్యూచువల్ ఫండ్ ఖాతాలో డబ్బులు కట్టొచ్చు. పండగలకు, పుట్టినరోజులకు ఖరీదైన బహుమతులకు బదులు, వారి ఫండ్ ఖాతాలో రూ. 5000 వేస్తే.. అదే వారికిచ్చే ఈ రోజు మంచి ఇంజినీరింగ్ కాలేజీలో సీటు రావాలంటే దాదాపు రూ.10లక్షల వరకూ అవసరం అవుతోంది. సగటున 10 శాతం ద్రవ్యోల్బణం లెక్కేస్తే.. మరో 18 ఏళ్ల తర్వాత దాదాపు రూ.55 లక్షలు అవసరం.. దీన్ని సాధించాలంటే.. సగటున 12 శాతం రాబడితో నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలో చూద్దాం..
చూశారుగా నెలకు రూ.5,000తో మదుపు ప్రారంభించినా.. 20 ఏళ్ల తర్వాత మీ పాప/బాబు చేతిలో రూ.50లక్షలు ఉంటాయి. 6 శాతం వడ్డీనిచ్చే పథకాల్లో దాచుకుంటే.. రూ.22 లక్షలు మాత్రమే జమవుతాయి.

### లాభాలేమిటి?

ఇంట్లో ఏదైనా అత్యవసరం రాగానే చాలామంది పిల్లల కోసం దాచిన డబ్బును వాడేస్తుంటారు. ఈ ఫండ్లలో జమ చేయడం వల్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. కాబట్టి, ఆ అవకాశం ఉండదు. కేవలం పిల్లల అవసరాల కోసమే డబ్బును వాడుకుంటాం. ఈక్విటీ మార్కెట్ దీర్ఘకాలంలో 1215 శాతం రాబడినిచ్చే అవకాశం ఉంటుంది. కాస్త నష్టభయం ఉన్నప్పటికీ, సంప్రదాయ పథకాలతో పోలిస్తే కాస్త మెరుగైన రాబడినే అందిస్తుంది.
డెట్ ఫండ్స్, ఎఫ్‌డీలతో పోలిస్తే వీటిలో పన్ను భారం తక్కువ. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల వరకూ వచ్చిన లాభంపై ఎలాంటి పన్ను వర్తించదు. ఆ పరిమితి దాటిన తర్వాత వచ్చిన లాభంపై మాత్రమే 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ఉంటుంది.
పిల్లలకు ఏదైనా అత్యవసర ఖర్చు వచ్చినా, ఇతర ఇబ్బందులు వచ్చినప్పుడు డబ్బు తీయాలంటే.. ఇబ్బంది ఎదురవుతుంది. లాకిన్ వ్యవధి పూర్తయిన తర్వాతా కొన్ని ఫండ్లు అమ్మకపు రుసుమును విధిస్తున్నాయి.

### ఇలా చేయొచ్చు...

మీకు ఆర్థిక క్రమశిక్షణ ఉంటే.. 'నేను పిల్లల కోసం దాస్తున్న డబ్బును ఎట్టి పరిస్థితుల్లోనూ తీయను' అనే నమ్మకం ఉంటే. ప్రత్యేకంగా పిల్లల ఫండ్లలోనే పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. మంచి పనితీరున్న ఫ్లెక్సీ క్యాప్ లేదా ఇండెక్స్ ఫండ్లనూ పరిశీలించవచ్చు. దీనికి పిల్లల చదువు అనే పేరు పెట్టుకోండి. సాధారణ ఫండ్లలో పనితీరు బాగా లేకపోతే, మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. చిల్డ్రన్స్ ఫండ్లలో ఆ స్వేచ్ఛ ఉండదు. డబ్బు చేతిలో నిలవదు అనుకునే వారికి మాత్రం.. చిల్డ్రన్ ఫండ్లే మంచి ఎంపిక.
పిల్లలకు 1617 ఏళ్లు వచ్చాక, ఈక్విటీలో నుంచి డబ్బును క్రమానుగత బదిలీ విధానం (ఎస్‌టీపీ) ద్వారా డెట్ పథకాల్లోకి మార్చుకోవాలి. అప్పుడు మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ లభిస్తుంది.




## ఐపీఓ.. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అంటే 2.43 రెట్లు స్పందన లభించింది. కేటగిరీ వారీగా చూసినప్పుడు.. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 3.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 3.35 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్ బయ్యర్ల కోటా 1 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.273 కోట్లు సమీకరించినట్లు భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ గురువారం వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా మొత్తం రూ.1,071 కోట్లు సమీకరించనుంది. జనవరి 13న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణిని రూ.2123గా కంపెనీ నిర్ణయించింది.

**విమాన తయారీలోకి అదానీ గ్రూప్!**

1972లో భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. జారియా (ఝార్ఖండ్), రాణిగంజ్ (పశ్చిమ బెంగాల్)లోని కోల్ మైన్స్ నుంచి కోకింగ్ కోల్‌ను సరఫరా చేస్తోంది. కోల్ ఇండియా వాల్యూ అన్‌లాక్‌లో భాగంగా అనుబంధ సంస్థలో వాటాలను ప్రభుత్వం విక్రయం చేపట్టింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (OFS) ద్వారా జరుగుతోంది.

# 2.5% వాటా విక్రయించనున్న రిలయన్స్!

మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఓల్లో రిలయన్స్ జియో ఒకటి. 50 కోట్ల మంది యూజర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీ కావడం, పైగా రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద సంస్థ నుంచి వస్తుండడంతో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ ఏడాదిలోనే రానున్న ఈ ఐపీఓకు సంబంధించి తాజాగా ఓ విషయం బయటకు వచ్చింది. తొలి పబ్లిక్ ఇష్యూ (IPO) ద్వారా 2.5 శాతం వాటాను రిలయన్స్ విక్రయించనున్నట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. తద్వారా మార్కెట్ నుంచి సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36 వేల కోట్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. దీంతో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా ఇది నిలవనుంది. రిలయన్స్ జియో మార్కెట్ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ 180 బిలియన్ డాలర్లుగా అంచనా కట్టింది. ఆ లెక్కన 2.5 శాతం వాటా విక్రయిస్తే సుమారు 4.5 బిలియన్ డాలర్లు అవుతుంది. ఈ వాటా విక్రయాన్ని ఆఫర్ ఫర్ సేల్ రూపంలో చేపడతారా లేక కొత్త షేర్ల జారీ ద్వారానా అనే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఓకు




సంబంధించి మోర్గాన్ స్టాన్లీ, కోటక్ మహీంద్రా బ్యాంకు ముసాయిదా పత్రాల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నాయని రాయిటర్స్ పేర్కొంది. అయితే ఈ విషయంలో రిలయన్స్ అధికారికంగా స్పందించలేదు. రిలయన్స్ జియోను రాబోయే ఐదేళ్లలో ఐపీఓకు తీసుకొస్తామని 2019లోనే ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఆ తర్వాత కేవలం టెలికాం వ్యాపారానికే పరిమితం కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోకీ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. తద్వారా కంపెనీ మార్కెట్ విలువను భారీగా పెంచుకోగలిగింది. ఐపీఓ ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణం. ఇదిలా ఉండగా కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు జియో మార్కెట్ విలువ 200 నుంచి 240 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతున్నాయి. ఇటీవల కాలంలో అనేక కంపెనీలు రిలయన్స్ జియోలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాయి. ఐపీఓ సమయంలో తమ వాటాలను విక్రయించి సొమ్ము చేసుకోవాలని ఆయా కంపెనీలు చూస్తున్నాయి.

# ఎప్పటికీ రోహితే నా కెప్టెన్!

ఐసీసీ ఛైర్మన్ జై షా




టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ఐసీసీ ఛైర్మన్ జై షా 'కెప్టెన్ణ అని సంబోధించాడు. దీనికి అక్కడున్న రోహిత్ శర్మ కూడా నవ్వులు చిందించాడు. రీసెంట్ ?గా రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహించిన ఈవెంట్ ?లో టీమ్ఇండియా క్రికెటర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హర్మన్ ప్రీత్ కౌర్ ?తోపాటు జై షా కూడా పాల్గొన్నాడు. ఈ ఈవెంట్ ?లో మాట్లాడిన జై షా హిట్ ?మ్యాన్ ?ను కెప్టెన్? అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ ?గా మారింది. 'మన కెప్టెన్ ఇక్కడే కూర్చొని ఉన్నాడు. అతడు టీమ్ఇండియాకు అతడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. అందుకే నేను రోహిత్ ?ను కేవలం కెప్టెన్ అనే పిలుస్తా. 2023 వరల్డ్ కప్ టోర్నీలో భారత్ వరుసగా పది మ్యాచ్ ?ల్లో నెగ్గింది. కానీ, ఆ టోర్నీలో ట్రోఫీ నెగ్గలేకపోయినా, మన జట్టు అభిమానుల హృదయాలు గెలుచుకుంది. తర్వాత నేను 2024 ఫిబ్రవరిలో రాజ్ కోట్ వేదికగా ఓ విషయం చెప్పాను. వచ్చే ప్రపంచకప్ ?లో ట్రోఫీతోపాటు అభిమానుల హృదయాలను కూడా గెలుచుకోబోతున్నాం' అని ఆ ఈవెంట్ ?లో జై షా అన్నారు.ఇక ఇదే ఈవెంట్ ?లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం 2024 టీ20 వరల్డ్ ?కప్? గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించారు. రోహిత్ శర్మ జర్నీ గురించి చెబుతూ అతడు యువతకు స్ఫూర్తి అని అన్నారు. 'రోహిత్ చిన్నప్పుడు తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద ఉండేవాడు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కిట్ ?తో బొరివాలి నుంచి చర్చ్ ?గేట్ ? దాకా లోకల్ ట్రైన్ ?లో ప్రయాణించేవాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ టీమ్ఇండియా కెప్టెన్? దాకా ఎదిగిన తీరు అద్భుతం. అలా రోహిత్ భారత క్రికెట్ ?లో అత్యుత్తమ ఆటగాళ్లో ఒకడిగా నిలిచాడు. అతడి జర్నీ ప్రపంచానికే స్ఫూర్తి. అతడో ఐకానిక్ణ అని నీతా అంబానీ అన్నారు. కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్ ?టైమ్ కెప్టెన్ ?గా బాధ్యతలు అందుకున్నాడు. 2022 టీ20 వరల్డ్ ?కప్ ?లో సెమీస్ ?లో భారత్ ఓడిరది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో భారత్ ?ను ఫైనల్ ?కు తీసుకెళ్లాడు రోహిత్. అతడి కెప్టెన్సీలోనే టీమ్ఇండియా ఏడాది కాలంలో రెండు సార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్ ?గా నిలిచింది.అలా భారత్ క్రికెట్ జట్టు దాదాపు 17ఏళ్ల తర్వాత 2024లో టీ20 వరల్డ్ ?కప్?, అలాగే 8ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది రోహిత్ కెప్టెన్సీలోనే. దీంతో భారత్ ?కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్ ?గా ధోనీ తర్వాతి స్థానంలో నిలిచాడు. అలా కెప్టెన్ ?గా కొంతకాలమే జట్టును నడిపించినప్పటికీ రోహిత్ తనదైన ముద్ర వేశాడు.రోహిత్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్ ?ల్లో ఓడిరది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్ ?ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది.కాగా, 2024 వరల్డ్ ?కప్ ఫైనల్ అనంతరం రోహిత్ టీ20లకు గుడ్ ?బై చెప్పేశా. ఇక గతేడాది మే నెలలో సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు కూడా రిటైర్మెంట్ పలికాడు. ప్రస్తుతం అతడు వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే గతేడాది ఆస్ట్రేలియా సిరీస్ ?కు ముందు రోహిత్ ?ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్ ?మన్ గిల్ ?ను మేనేజ్ ?మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్ ?కు కెప్టెన్ ?గా నియమించింది. ఇక టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.

## బ్రూక్?కు 30 వేల పౌండ్లు జరిమానా



ఇంగ్లాండ్ వైట్ ?బాల్ కెప్టెన్ హ్యారీ బ్రూక్?పై ఓ నైట్ ?క్లబ్ బౌన్సర్ చేయి చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గతేడాది నవంబర్ 1న న్యూజిలాండ్‌తో మూడో వన్డే మ్యాచ్ ?కు ముందు రోజు బ్రూక్ మద్యం మత్తులో ఓ నైట్ క్లబ్ వద్ద గొడవకు దిగాడు. ఈ క్రమంలో సదరు బౌన్సర్ బ్రూక్‌పై బౌన్సర్ చేయి చేసుకున్న. దీన్ని సీరియస్ ?గా తీసుకున్న ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మేనేజ్ ?మెంట్ బ్రూక్ ?కు 30 వేల పౌండ్లు జరిమానా విధించింది.2025 అక్టోబర్ 31న బ్రూక్ తన సహచర క్రికెటర్లు జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్‌తో కలిసి వెల్లింగ్‌టన్‌లో ఓ నైట్ క్లబ్‌కు వెళ్లాడు. అయితే ఈ సమయంలో బ్రూక్ మద్యం తాగి ఉన్నాడని అనుమానించిన బౌన్సర్ అతడిని లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే క్లబ్ వద్ద తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వివాదంలో బ్రూక్ ?పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. అయితే ఈ వివాదంపై ఇంగ్లాండ్ బోర్డు విచారణ చేపట్టింది. దీనిపై బ్రూక్ కూడా బోర్డుకు వివరణ ఇచ్చాడట. తన ప్రవర్తనకుగానూ బ్రూక్ క్షమాపణలు చెప్పాడు. తన చర్యలు తప్పు అని, దానిని అతడు పూర్తిగా అంగీకరిస్తున్నట్లు తెలిపాడు. 'నా చర్యలు తప్పు అని నేను పూర్తిగా అంగీకరిస్తున్నా. నా చర్యలు నాకే కాదు, మా జట్టుకు కూడా ఇబ్బంది కలిగించాయి. ఇంగ్లాండ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అనేది గొప్ప గౌరవం' 'జరిగిన దాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తాను. సహచరు ఆటగాళ్లు, కోచ్‌లు, మద్దతుదారులను నిరాశపరిచినందుకు నేను తీవ్రంగా చింతిస్తున్నా' అని బ్రూక్ ఒక ప్రకటన విడుదల చేశాడు. ఇక బ్రూక్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇంగ్లాండ్ బోర్డు, అతడికి ఫైనల్ వార్నింగ్ ఇచ్చి 30 వేల పౌండ్లు జరిమానాగా విధించింది. ప్రస్తుతం యాషెస్ సిరీస్? కోసం ఇంగ్లాండ్ క్రికెట్ టీమ్ ఆస్ట్రేలియాలో ఉంది. అయితే ఈ సిరీస్ ?లో రెండు మూడో టెస్టుకు మధ్య 9 రోజుల విరామం దొరికింది. దీంతో ఈ గ్యాప్ ?లో ఇంగ్లాండ్ ప్లేయర్లు ఫుల్లుగా మద్యం తాగి ఎంజాయ్ చేసినట్లు వార్తలొచ్చాయి. నోసా బీచ్ రిసార్ట్‌లో మద్యం మత్తులో మునిగితేలారని ఇటీవల కథనాలు వచ్చాయి.ఈ యాషెస్ ?లో బ్రూక్ ఫర్వాలేదనిపించాడు. 10 ఇన్నింగ్స్ ?ల్లో కలిపి 39.78 యావరేజ్ ?తో 358 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. దీంతో ఈ సిరీస్ ?లో అత్యధిక పరుగుల చేసిన బ్యాటర్ల లిస్ట్ ?లో మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఈ లిస్ట్ ?లో టాప్ ?లో ఉన్నాడు. అతడు 10 ఇన్నింగ్స్ ?ల్లో 62.90 సగటుతో 629 పరుగులు చేయగా, ఇంగ్లాండ్ స్టార్ జో రూట్ 400 రన్స్ ?తో రెండో స్థానంలో నిలిచాడు.

## వడోదరలో కొత్తగా నిర్మించిన కోటాంబి స్టేడియం



టీమిండియా 2026 కొత్త ఏడాదిని అదిరిపోయే క్రికెట్ వేటతో ప్రారంభించబోతోంది. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ వన్డే సిరీస్‌లో హైలైట్ ఏంటంటే.. తొలి మ్యాచ్ వడోదరలో కొత్తగా నిర్మించిన కోటాంబి స్టేడియంలో జరగబోతోంది. ఇది పురుషుల అంతర్జాతీయ క్రికెట్‌కు వేదిక కావడం ఇదే మొదటిసారి. బరోడా క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ స్టేడియం విశేషాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వడోదర నగరం వెలుపల హరోద్‌హలోల్ హైవే సమీపంలో నిర్మించిన కోటాంబి స్టేడియం భారత క్రికెట్ మ్యాప్‌లో సరికొత్త సెంటర్‌గా అవతరించింది. 2024 డిసెంబర్‌లో భారత్‌వెస్టిండీస్ మహిళల మ్యాచ్‌తో ఈ స్టేడియం తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఇప్పుడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి హేమాహేమీలు ఈ గ్రౌండ్‌లో మొదటిసారి బరిలోకి దిగబోతున్నారు.

# ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టి వైభవ్ సూర్యవంశీ వైపు



టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్ 19 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన వేటను ప్రారంభించనుంది. అయితే ఈ టోర్నీలో వైభవ్ ఒక భారీ లక్ష్యన్ని తన కళ్లముందు ఉంచుకున్నాడు. అదే మిషన్ 607. ఈ సంఖ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో తెలిస్తే మీరు షాక్ అవుతారు.అండర్ 19 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఆయిన్ మోర్గాన్ పేరిట ఉంది. మోర్గాన్ 2004 మరియు 2006లో ఐర్లాండ్ తరపున ఆడి మొత్తం 606 పరుగులు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి 607 పరుగులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్గాన్ ఈ ఘనతను రెండు వరల్డ్ కప్ లలో సాధించగా, వైభవ్ మాత్రం తన అద్భుత ఫామ్‌తో ఈ ఒక్క టోర్నీలోనే ఆ మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. ఇది వినడానికి కష్టంగా అనిపించినా, వైభవ్ బాదుడు చూస్తుంటే అది అసాధ్యమేమీ కాదనిపిస్తోంది.ఇటీవల జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీమిండియాకు 30తో వన్డే సిరీస్‌ను అందించాడు. బౌలర్ ఎవరైనా సరే ఏమాత్రం కనికరం లేకుండా స్టేడియం బయటకు పంపడమే వైభవ్ స్టైల్. అదే ఊపును ఇప్పుడు వరల్డ్ కప్ లో కూడా కొనసాగించాలని కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్ గా వైభవ్ ఇచ్చే మెరుపు ఆరంభాలు భారత్ కు కొండంత బలాన్ని ఇస్తున్నాయి. వరల్డ్ కప్ మెయిన్ మ్యాచుల కంటే ముందు వైభవ్ రెండు వార్మప్ మ్యాచుల్లో తన సత్తా చాటనున్నాడు. జనవరి 10న స్కాట్లాండ్‌తో, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. ఇక అసలైన టోర్నీలో జనవరి 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. మూడో లీగ్ మ్యాచ్ జనవరి 24న జరుగుతుంది. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో సెమీ ఫైనల్స్, ఫిబ్రవరి 6న గ్రాండ్ ఫైనల్ జరగనుంది. వైభవ్ గనుక ఫైనల్ వరకు తన ఫామ్‌ను కొనసాగిస్తే మిషన్ 607 సాధించడం నల్లేరు మీద నడకే. అతి చిన్న వయసులోనే ఎంతో పరిణతితో ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ, భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. మరి ఆయిన్ మోర్గాన్ 20 ఏళ్ల నాటి రికార్డును వైభవ్ తుడిచిపెట్టగలడా? లేదా అనేది చూడాలి. క్రికెట్ అభిమానులంతా ఈ యువ కెరటం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రియాన్ పరాగ్?కు ఛాన్స్ లభించేనా?



టీమిండియా యువ సంచలనం తిలక్ వర్మ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరగబోయే మొదటి మూడు టీ20లకు దూరమయ్యాడు. విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్న సమయంలో అతనికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రాజ్‌కోట్‌లో అత్యవసరంగా సర్జరీ చేశారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నప్పటికీ, మైదానంలోకి రావడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో తిలక్ వర్మ స్థానంలో ఎవరిని తీసుకోవాలనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాష్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీసీఐ అధికారిక సమాచారం ప్రకారం.. బుధవారం జనవరి 7న తిలక్ వర్మకు పొత్తికడుపులో వచ్చిన సమస్య కారణంగా సర్జరీ జరిగింది. గురువారం ఉదయం అతను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రస్తుతం విశ్రాంతి కోసం హైదరాబాద్ వస్తున్న తిలక్, గాయం పూర్తిగా మానిన తర్వాతే మళ్ళీ ట్రైనింగ్ మొదలుపెడతాడు. దీనివల్ల న్యూజిలాండ్‌తో జరిగే మొదటి మూడు టీ20లకు అతను అందుబాటులో ఉండడు. మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఆడతాడా లేదా అనేది అతని రికవరీని బట్టి బోర్డు నిర్ణయిస్తుంది. తిలక్ వర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ లేదా యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని చాలా మంది అంటున్నప్పటికీ, ఆకాష్ చోప్రా మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారు. దానికి ఆయన ఒక లాజిక్ చెప్పారు. "మీకు కావాల్సింది ఓపెనర్ కాదు, ఎందుకంటే తిలక్ వర్మ 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. కాబట్టి మిడిల్ ఆర్డర్‌లో ఆడే ప్లేయర్ కావాలి. గిల్, జైస్వాల్ ఇద్దరూ ఓపెనర్లు, కాబట్టి వారిని రిప్లేస్‌మెంట్‌గా చూడలేం" అని ఆకాష్ వివరించారు. తిలక్ వర్మ స్థానంలో ఆకాష్ చోప్రా ముగ్గురి పేర్లను సూచించారు. అందులో మొదటిది శ్రేయస్ అయ్యర్ (సర్పంచ్ సాబ్). ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో అయ్యర్ మంచి ఫామ్‌లో ఉన్నాడని, అతనికి అంతర్జాతీయ అనుభవం కూడా తోడవుతుందని ఆకాష్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ అయ్యర్ కాకపోతే రెండో ఆప్షన్ గా రియాన్ పరాగ్ పేరు చెప్పారు. పరాగ్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కూడా ఉపయోగపడతాడు. ఇక మూడో ఆప్షన్ గా ఫినిషర్ రోల్ కోసం జితేష్ శర్మ పేరును ఆయన ప్రస్తావించారు. న్యూజిలాండ్ లాంటి బలమైన జట్టుపై పోరాడాలంటే మిడిల్ ఆర్డర్ బలంగా ఉండాలి. తిలక్ వర్మ దూరం అవ్వడం టీమ్ ఇండియాకు లోటే అయినప్పటికీ, శ్రేయస్ అయ్యర్ లాంటి సీనియర్ ప్లేయర్ జట్టులోకి వస్తే అది అదనపు బలం అవుతుంది. సెలెక్టర్లు ఆకాష్ చోప్రా సూచనలను పాటిస్తారా లేదా అనేది చూడాలి. తిలక్ వర్మ త్వరగా కోలుకోవాలని కోరుకుందాం.

# సెమీఫైనల్లో పీవీ సింధు..




**గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సింధు సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యఅబశ్రీశ్రీలోనే జపాన్ ప్లేయర్ అకానే యమగుచి గాయంతో తప్పకోవడంతో సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. యమగుచి ఆట నుంచి తప్పకోవడానికి ముందు సింధు 21-11తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంకర్ యమగుచితో ముఖాముఖి పోరును 15-12తో 18వ ర్యాంకర్ సింధు మెరుగుపర్చుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ వాంగ్ జియితో సింధు తలపడనుంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-13తో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజకి(జపాన్)ను ఓడిరచింది. కేవలం 33 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను సింధు ముగించడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో యమగుచి గాయం సింధుకు కలిసొచ్చింది.**



# కెండ్రా లస్ట్ తో విరాట్ కోహ్లీ..?

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతనికి భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. శత్రు దేశం పాకిస్థాన్‌లోనూ కోహ్లీ అంటే పడి చచ్చే అభిమాన గణం ఉంది. దాంతో కోహ్లీ తరుచూ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే తాజాగా కెండ్రా లస్ట్ అనే అమెరికా శృంగార తార.. సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీతో ఉన్న ఫోటోను పంచుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుకోకుండా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీని యూకేలో కలిసానని కెండ్రా లస్ట్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫొటోను పంచుకుంది. ఈ పోస్ట్‌కు కెండ్రా లస్ట్.. 'అనుకోకుండా జరిగే సమావేశాలు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉంటాయి. ఎంత గొప్ప స్ఫూర్తి, నిజంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి'అనే క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటో క్షణాల్లో వైరల్ కాగా.. ఇది ఫేక్ అంటూ అభిమానులు తేల్చేసారు. ఏఐ జనరేటెడ్ ఫొటో అని కామెంట్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నప్పటికీ.. గత నెలరోజులుగా భారత్‌లోనే ఉన్నాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చిన కోహ్లీ.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు. అలాంటిది కోహ్లీని యూకేలో కెండ్రా లస్ట్ ఎలా కలిసిందని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కెండ్రా లస్ట్ తరుచూ ఏఐ జనరేటెడ్ ఫొటోలను పంచుకుంటుంది. ఇటీవల భారత బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ను కలిసినట్లు ఏఐ జనరేటెడ్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకొని వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు.


# పంజాబ్ పై విరుచుకుపడ్డ శ్రేయస్ అయ్యర్



**టీమిండియా స్టార్ బ్యాటర్, ముంబై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మైదానంలో పంజా విసిరాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత విజయ్ హజారే ట్రోఫీ బరిలోకి దిగిన అయ్యర్.. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తనదైన శైలిలో ప్రత్యర్థి బౌలర్లకు సమాధానం ఇచ్చాడు. ముఖ్యంగా తలకు బంతి తగిలిన మరుసటి బంతికే కళ్లు చెదిరే సిక్సర్ బాది, తనలో పౌరుషం తగ్గలేదని నిరూపించుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ గత కొంతకాలంగా ప్లీన్ లాసరేషన్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకుని విజయ్ హజారే ట్రోఫీలో ముంబై జట్టు సారథిగా బరిలోకి దిగాడు. పంజాబ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఓడిపోయినప్పటికీ, అయ్యర్ ఆడిన 34 బంతుల్లో 45 పరుగుల ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచింది. పాత అయ్యర్ మళ్ళీ ఫామ్‌లోకి వచ్చాడని అతని బ్యాటింగ్ చూస్తుంటే అర్థమైంది. ఈ మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన జరిగింది. శ్రేయస్ అయ్యర్‌కు షార్ట్ పిచ్ బంతులు అంటే బలహీనత అని ఒక పేరుంది. దీనిని ఆసరాగా చేసుకుని పంజాబ్ బౌలర్ ఒక వేగవంతమైన బౌన్సర్ వేశాడు. ఆ బంతి నేరుగా వెళ్లి అయ్యర్ హెల్మెట్‌కు బలంగా తగిలింది. వెంటనే మెడికల్ స్టాఫ్ మైదానంలోకి వచ్చి కన్కషన్ చెకప్ చేశారు. అయ్యర్ కాసేపు ఇబ్బంది పడ్డాడు. కానీ, తర్వాతి బంతికే బౌలర్ మళ్ళీ బౌన్సర్ వేయగా.. అయ్యర్ ఏమాత్రం తడబడకుండా కళ్లు చెదిరే పుల్ షాట్ ?తో బంతిని స్టాండ్స్ లోకి పంపాడు. తర్వాతి బంతికే సిక్సర్ కొట్టిన విధానం చూస్తుంటే, తనపై ఉన్న విమర్శలకు అయ్యర్ తన బ్యాట్ తోనే సమాధానం చెప్పినట్లు అనిపించింది. షార్ట్ పిచ్ బౌలింగ్ అంటే తనకు భయం లేదని, తనను రెచ్చగొడితే ఫలితం ఇలాగే ఉంటుందని అయ్యర్ నిరూపించాడు. ఈ అద్భుతమైన షాట్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతోంది. అయ్యర్ లోని ఈ కాన్ఫిడెన్స్ చూసి ముంబై ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.ముంబై జట్టు ఈ మ్యాచ్ లో విజయం సాధించలేకపోయినా, శ్రేయస్ అయ్యర్ ఫామ్ లోకి రావడం టీమిండియాకు కూడా శుభసూచకం. త్వరలో జరగబోయే ముఖ్యమైన సిరీస్‌ల కోసం అయ్యర్ సిద్ధంగా ఉన్నాడని ఈ ఇన్నింగ్స్ చాటి చెప్పింది. ముఖ్యంగా బౌన్సర్లకు అయ్యర్ భయపడటం లేదనే విషయం ప్రత్యర్థి జట్లకు ఒక హెచ్చరిక లాంటిదే.**

# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహాల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహాల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది.కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యూజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ఫైట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.





## మొసలి బొమ్మలతో ప్రభాస్ అభిమానుల సందడి

ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' నేడు ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి మొసలి మీ మ్స్ సోషల్ మీ డియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. నేడు ఈ చిత్రం విడుదల కావడంతో కొందరు అభిమానులు ఏకంగా మొసలి బొమ్మలను థియేటర్‌లలోకి తీసుకెళ్లి హంగామా చేస్తున్నారు. క్లైమాక్స్‌లో ప్రభాస్ మొసలితో ఫైట్ చేసే సన్నివేశం థియేటర్‌లో వచ్చే సమయంలో ఆ బొమ్మలతో స్క్రీన్ వద్దకు వెళ్లి దాన్ని రీక్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీ డియాలో షేర్ అవుతున్నాయి. అయితే కొందరు మాత్రం ఇవి ఏఐతో చేసిన వీడియోలంటూ కామెంట్స్ పెడుతున్నప్పటికీ ఈ సినిమా విడుదల సందర్భంగా మొసలి మాత్రం హైలైట్ అవుతోంది. 'ఎవర్రా మీ రంతా..', 'ఇది మొసళ్ల పండగ' అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.

## శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల

శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రాని కి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తం గా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.





## ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

**ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ**

సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్`15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది. ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ ప్రక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.

## యాక్షన్ మోడల్‌లో సమంత సూపర్బ్

చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది..' అంటూనే ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొడుతున్నారు సమంత. ఆమె ప్రధానపాత్రలో నందిని రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. తాజాగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత అమాయకంగా కనిపిస్తూనే యాక్షన్ సన్నివేశాల్లో తనదైన శైలిలో నటించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు ఈ వీడియో ఆధారంగా తెలుస్తోంది. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు.




## జన నాయగన్' సినిమాకు ఊరట

**సెన్సార్ సర్టిఫజకెట్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం**

విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరపున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడిరది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు సమాచారం.

